వినేశ్‌కు ఘన స్వాగతం

భారీ సంఖ్యలో అభిమానుల రాక • భావోద్వేగానికి లోనైన స్టార్ రెజ్లర్

న్యూఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్‌కు సొంతగడ్డపై అపూర్వ స్వాగతం లభించింది. అందరూ ఊహించినట్లే పతక విజేతలకు మించి అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి రెజ్లర్‌కు స్వాగతం పలికారు. శనివారం ఉదయం 10.30కు ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఫోగాట్ కోసం సహచర రెజ్లర్లు సాక్షి మాలిక్, జబరంగ్ పునియాతో పాటు హర్యానా కాంగ్రెస్ లీడర్ దీపేందర్ హుడా, పంచాయత్ సభ్యులు తరలివచ్చారు. ఓవైపు 'డోల్' చప్పుల మధ్య ఫ్యాన్స్ నృత్యాలు చేస్తూ వినేశ్‌పై పూల వర్షం కురిపించారు. అభిమానుల తాకిడి నేపథ్యంలో ఆమెకు మెరుగైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఓపెన్ టాప్ జీపులో బజరంగ్, సాక్షితో కలిసి అభిమానులకు అభివాదంచేస్తూ వినేశ్ ముందుకు సాగింది. ఈ క్రమంలో దీపేందర్ విజయానికి చిహ్నమైన గదను బహుకరించగా.. ఒకింత భావోద్వేగానికి లోనైన వినేశ్‌ను ఆమె భర్త సోమ్‌వీర్, సాక్షి, దీపేందర్ ఓదార్చారు. తన సొంత గ్రామమైన బలాలీకి చేరుకునే క్రమంలో ఢిల్లీలోని ద్వారక దేవాయలంలో వినేశ్ పూజలు చేసింది. మొత్తం 135 కి.మీ ప్రయాణానికి దాదాపు 10 గంటల సమయం పట్టగా, దారి మధ్యలో పలు కాప్ పంచాయతీలకు చెందిన సభ్యులు ఆమె ఆత్మీయంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'మీరు నాపై చూపించిన ప్రేమ, గౌరవం..1000 ఒలింపిక్ పసిడి పతకాలు గెలిచిన దాని కంటే ఎక్కువ' అని చెమర్చిన కండ్లతో అంది. ఇదిలా ఉంటే ఇప్పటికే తన కెరీర్‌కు వీడ్కోలు పలికిన వినేశ్..కొనసాగే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. కొద్దిరోజులు కుటుంబసభ్యులతో గడిపిన తర్వాత వినేశ్ ఏదో ఒక నిర్ణయానికి వస్తుందని సాక్షి మాలిక్ పేర్కొంది. వంద గ్రాముల అధిక బరువుతో అనర్హతకు గురైన వినేశ్‌కు అంతర్జాతీయ క్రీడాన్యాయ స్థానం(కాస్)లో చుక్కెదురైన సంగతి తెలిసిందే. కాస్ తీర్పును వినేశ్ తిరిగి సవాల్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

తెలంగాణలో స్పోర్ట్స్ యూనివర్సిటీ!

- ఒలింపిక్స్ స్థాయి ప్రమాణాలతో క్రీడా అకాడమీలు
- అథ్లెట్లకు శిక్షణలో కొరియన్ స్పోర్ట్స్ వర్సిటీ సహకారం

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ (ఫోర్త్ సిటీ)లో నిర్మించే స్పోర్ట్స్ హబ్‌లో దీన్ని ఏర్పాటు చేయాలని చూస్తున్నది. దాదాపు 12 వివిధ క్రీడల అకాడమీలను ఇక్కడే పెట్టాలని భావిస్తున్నది. వీటిలో అంతర్జాతీయ స్థాయి అధునాతన మౌలిక సదుపాయాలు ఉంటాయి. ఈ స్పోర్ట్స్‌హబ్‌లో స్పోర్ట్స్ సైన్స్ సెంటర్, స్పోర్ట్స్ మెడిసిన్ సెంటర్ కూడా ఉండేలా ఏర్పాట్లు చేయనున్నారు. కొత్తగా స్థాపించిన స్కిల్ యూనివర్సిటీ తరహాలోనే తెలంగాణ స్పోర్ట్స్ వర్సిటీకి 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ' అనే పేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనువైన స్థలంగా ప్రస్తుతం హకీంపేటలో ఉన్న స్పోర్ట్స్ స్కూల్ లేదా గచ్చిబౌలిలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను పరిశీలిస్తున్నారు. ఆ క్యాంపస్‌ను ఒలింపిక్స్ స్థాయి అంతర్జాతీయ ప్రమాణాలు ఉండేలా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల దక్షిణ కొరియాలో పర్యటనలో సియోల్‌లోని కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శించారు. ఇది ప్రపంచంలోనే పేరొందిన స్పోర్ట్స్ వర్సిటీగా ప్రత్యేకత చాటుకున్నది. భవిష్యత్తులో ఒలింపిక్ చాంపియన్లకు శిక్షణ ఇచ్చేలా తెలంగాణ యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి సాంకేతిక భాగస్వాములుగా కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ సేవలను వాడుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది.

గాయం వల్లనే..

పారిస్ ఒలింపిక్స్‌ప్రదర్శనపై నీరజ్ • డైమండ్ లీగ్ బరిలో స్టార్ అథ్లెట్ • 90మీటర్ల మార్క్ లక్ష్యంగా ప్రాక్టీస్

గాయం కారణంగా తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయానని భారత డబుల్ ఒలింపియన్ నీరజ్ చోప్రా పేర్కొన్నాడు. ఇటీవలే ముగిసిన ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌లో నీరజ్ వెండి వెలుగులు విరజిమ్మాడు. ఓవైపు గాయం వేధిస్తున్నా..బల్లాన్ని అద్భుతంగా విసురుతూ రెండో స్థానంలో నిలిచాడు. అంచనాలు అందుకోలేకపోవడానికి గాయం తీవ్ర ప్రభావం చూపించిందని చెప్పుకొచ్చాడు. పూర్తి ఫిట్‌నెస్‌తో ఉంటే 90మీటర్ల మార్క్‌ను కచ్చితంగా చేరుకునేవాడనని స్పష్టం చేశాడు. రానున్న డైమండ్ లీగ్ కోసం సిద్ధమవుతున్న చోప్రా..వచ్చే ఒలింపిక్స్‌లో భారత్ మరింత మెరుగైన ప్రదర్శన కనబరుస్తుందని అన్నాడు.

న్యూఢిల్లీ: భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా..పారిస్ ఒలింపిక్స్ ప్రదర్శనతో పాటు పలు అంశాలపై మాట్లాడాడు. డైమండ్ లీగ్ కోసం ప్రస్తుతం స్విట్జర్లాండ్‌లో శిక్షణ తీసుకుంటున్న చోప్రా..శనివారం వర్చువల్ ఇంటర్వ్యూలో ముచ్చటించాడు.

90మీటర్ల లక్ష్యంపై..?

వాస్తవానికి పారిస్ ఒలింపిక్స్‌లో 90మీటర్ల మార్క్ అందుకోవాలన్న లక్ష్యాన్ని ఎంచుకున్నాను. కానీ గజ్జల్లో గాయంతో అనుకున్న మేర జావెలిన్‌ను విసరలేకపోయాను. గాయం వేధిస్తుండటంతో రనప్ సరిగ్గా లేకపోవడం విసిరిన బల్లెం సరైన దిశలో వెళ్లకపోవడంతో లక్ష్యాన్ని అందుకోవడంలో విఫలమయ్యాను. కానీ రానున్న టోర్నీల్లో వందకు వంద శాతం విసిరేందుకు ప్రయత్నిస్తా. చూద్దాం ఏం అవుతుందో.

అర్షద్‌తో పోటీపై?

పారిస్ ఒలింపిక్స్‌లో నాకు, పాకిస్థాన్ జావెలిన్ త్రో అథ్లెట్ అర్షద్ నదీమ్ మధ్య స్నేహపూర్వక పోటీ కొనసాగింది. ఇద్దరం తొలిసారి విసిరినప్పుడు ఫౌల్ అయ్యాం. ఆ తర్వాత రెండో ప్రయత్నంలో అర్షద్ 92.97 మీటర్ల దూరం విసిరి కొత్త ఒలింపిక్ రికార్డు నెలకొల్పాడు. ఆ తర్వాత వచ్చిన నా వంతులో 89.45 మీటర్ల దూరం మాత్రం విసరగలిగాను. అర్షద్‌ను చేరుకునేందుకు ప్రయత్నించినా..గాయం కారణంగా పూర్తి స్థాయిలో రాణించలేకపోయాను. వంద శాతం ప్రయత్నం చేసేందుకు శరీరం, మనసు సహకరించలేకపోయింది. గాయంతో ట్రైనింగ్ సెషన్లలో సరిగ్గా విసరలేకపోవడం నా ప్రదర్శనపై ప్రభావం చూపించింది.

టెక్నిక్‌పై దృష్టి పెట్టారా?

పారిస్‌లో కొన్ని వైఫల్యాలు దెబ్బతీశాయి. ముఖ్యంగా జావెలిన్‌ను వేగంగా విసిరినా..లైన్ సరిగ్గా లేకపోవడంతో దూరం తగ్గింది. ఒకవేళ బల్లెం సరైన దిశలో వెళ్లి ఉంటే..మరో రెండు, మూడు మీటర్ల దూరం కలిసి వచ్చేది.

డైమండ్ లీగ్ కోసం సన్నద్ధత?

ఈనెల 22 నుంచి లూసానెలో డైమండ్ లీగ్ మొదలవుతున్నది. ఇందుకోసం ప్రాక్టీస్ చేస్తున్నాను. టాప్-6లో నిలువడం ద్వారా సెప్టెంబర్‌లో జరిగే డైమండ్ లీగ్ ఫైనల్‌కు అర్హత సాధించే అవకాశం లభిస్తుంది. నెల రోజుల్లో సీజన్ ముగిసిన తర్వాత గాయానికి శస్త్రచికిత్స చేయించుకుంటాను.

భారత ప్రదర్శనపై?

భారత్ స్పోర్ట్స్ పవర్‌హౌజ్‌గా మారాలంటే..విప్లవాత్మక మార్పులు రావాలి. ముఖ్యంగా అందరూ అన్ని రకాల క్రీడలు ఆడేందుకు ముందుకు రావాలి. ఏ క్రీడలోనైతై రాణించగలమో గుర్తించి అందుకు తగ్గట్లు ముందుకు సాగాలి. చైనా, అమెరికా, జపాన్ పతకాల సాధనలో ముందున్నాయి అంటే వాళ్ల విధానాల వల్లే. రానున్న రోజుల్లో మనం ఒలింపిక్స్‌తో పాటు ఫిఫా ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధిస్తామన్న నమ్మకం నాకుంది.

వావ్ ఖెలిఫ్!

అల్జీరియా బాక్సర్ అందంపై ఫిదా

అల్జీరియా: ఇమానె ఖెలిఫ్...అల్జీరియా వివాదాస్పద బాక్సర్. ఇటీవలి పారిస్ ఒలింపిక్స్‌లో తనపై వచ్చిన విమర్శలకు పసిడి పతకంతో పంచ్‌లు కురిపించింది. ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తు చేస్తూ తన దేశానికి స్వర్ణ పతకాన్ని అందించింది. ఈ క్రమంలో ఖెలిఫ్‌లోని కొత్త కోణం బయటకు వచ్చింది. బాక్సింగ్ రింగ్‌లో దూకుడుగా పంచ్‌లు విసరడమే కాదు.. అందం విషయంలో తనను మించిన వారు లేరని నిరూపించుకునే ప్రయత్నం చేసింది. ఖెలిఫ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఫ్లోరల్ డిజైన్‌లో మెరిసిపోతున్న ఖెలిఫ్ నవ్వులు చిందిస్తున్నది.

43 మందితో బరిలో

అండర్-20 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: లిమా వేదికగా ఈనెల 27 నుంచి 31 వరకు జరుగనున్న అండర్-20 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 43 మందితో కూడిన జట్టుతో భారత్ బరిలోకి దిగనుంది. గత ఎడిషన్‌లో భారత్ 25వ ర్యాంక్‌లో నిలిచింది.

రన్నరప్ హవ్య

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్‌లో జరుగుతున్న తెలంగాణ షార్ట్‌కోర్స్ అంతరజిల్లాల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో హవ్య అదరగొట్టింది. శనివారం జరిగిన టోర్నీ 400మీటర్ల ఫ్రీస్టయిల్, 100మీటర్ల బటర్‌ఫ్లై ఈవెంట్లలో హవ్య రన్నరప్‌గా నిలిచింది. ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ రెండో స్థానం దక్కించుకుంది. ప్రస్తుతం బ్లూడాల్ఫిన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఈ యువ స్విమ్మర్ మాండ్య (కర్ణాటక)లో ఈ నెల 30 నుంచి జరిగే సౌత్‌జోన్ అక్వాటిక్ చాంపియన్‌షిప్‌నకు ఎంపికై ప్రతిభ చాటింది.

ఓడిన కోపంలో..రాకెట్ నేలకేసికొట్టి

అల్కారజ్ దుందుడుకు చర్య

సిన్సినాటి: స్పెయిన్ నయా సంచలనం కార్లోస్ అల్కారజ్ విచక్షణ కోల్పోయాడు. ఇప్పటికే పలు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలువడం ద్వారా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న అల్కారజ్ ఓడిన కోపంలో రాకెట్‌ను నేలకేసి బలంగా కొట్టాడు. వర్షం అంతరాయం కారణంగా వాయిదాతో శుక్రవారం జరిగిన పోరులో అల్కారజ్ 6-4, 6-7(5-7), 4-6తో గేల్ మోనోఫిల్స్(ఫ్రాన్స్) చేతిలో అనూహ్య ఓటమి చవిచూశాడు. తొలి సెట్‌ను 6-4తో గెలుచుకున్న ఈ స్పెయిన్ స్టార్..వరుసగా రెండు సెట్లను మోనోఫిల్స్‌కు చేజార్చుకున్నాడు. ఈ క్రమంలో కోపాన్ని అణుచుకోలేకపోయిన అల్కారజ్ రాకెట్‌ను ముక్కలయ్యేవరకు బాదాడు. 'ఇప్పటి వరకు నా కెరీర్‌లో చెత్త మ్యాచ్. దీని కోసం చాలా ప్రాక్టీస్ చేశాను. కానీ స్థాయికి తగ్గ ఆటతీరు ప్రదర్శించలేకపోయాను. ఇదంతా మరిచిపోయి యూఎస్ ఓపెన్ కోసం న్యూయార్క్ బయల్దేరి వెళ్లాలి' అని అన్నాడు. మోనోఫిల్స్‌తో మ్యాచ్‌లో అలా వ్యవహరించడంపై అల్కారజ్ క్షమాపణలు చెప్పాడు.

తెలంగాణ దుఃఖంలోంచి పుట్టిందే కాళేశ్వరం

- తుమ్మిడిహెట్టి వద్ద నీటిలభ్యత లేకనే రీ డిజైన్
- ప్రాజెక్టు విద్యుత్తు చార్జీలపై దుష్ప్రచారం
- జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వీ ప్రకాశ్
- జస్టిస్ పీసీ ఘోష్‌కు పలు అంశాలపై వివరణ

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ దుఃఖంలోంచి పుట్టిందే కాళేశ్వరం ప్రాజెక్టని, తుమ్మిడిహెట్టి కోణం నుంచి చూస్తే అది ఎవరికీ అర్థం కాదని తెలంగాణ రాష్ట్ర జలవనరుల సంస్థ మాజీ చైర్మన్ వీ ప్రకాశ్ వెల్లడించారు. ప్రాజెకు విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్‌ను శనివారం ఆయన ప్రత్యేకంగా కలిసి కాళేశ్వరంపై జరుగుతున్న ప్రచారం, వాస్తవాలు, ప్రాజెక్టు రీ డిజైన్ ఆవశ్యకత, ప్రయోజనాలను వివరించారు. అనంతరం బీఆర్కే భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. తెలంగాణ భవిషత్తు కోసమే కేసీఆర్ అన్ని ప్రాజెక్టులను డిజైన్ చేశారని వివరించారు. వాస్తవంగా అక్కడ 165 టీఎంసీల నీటి లభ్యత ఉన్నా అందులో ఎగువ రాష్ట్రాలు వినియోగించుకోని 63టీఎంసీలు ఉన్నాయని, ఆ జలాలను మినహాయిస్తే అక్కడ నికర నీటి లభ్యత 102 టీఎంసీలేనని వివరించారు. బరాజ్ ఎత్తును 152ఎఫ్ఆర్ఎల్ వద్ద నిర్మించేందుకు మహారాష్ట్ర సర్కారు ఒప్పుకోలేదని, 148ఎఫ్ఆర్ఎల్‌కే సుముఖత వ్యక్తం చేసిందని, ఆ ఎత్తులో బరాజ్ నిర్మిస్తే తెలంగాణ వినియోగించుకోగలిగేది 54టీఎంసీలకు మించవని తెలిపారు. ప్రాజెక్టు ప్రాంతంలో చాప్రాల్ అభయారణ్యం కూడా ఉన్నదని, అనుమతుల సాధన కష్టమని, ఈ సవాళ్లన్నింటి నేపథ్యంలోనే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కేసీఆర్ రీ డిజైన్ చేసి మేడిగడ్డకు మార్చారని గుర్తుచేశారు. హైదరాబాద్ రాష్ట్రం ఉన్నప్పుడు కృష్ణా, గోదావరి బేసిన్‌లో 9 భారీ ప్రాజెక్టుల నిర్మాణానికి రూపకల్పన జరిగితే ఆంధ్రలో విలీనం తర్వాత 7 ప్రాజెక్టులు అటకెక్కాయని తెలిపారు. కృష్ణా, గోదావరిపై కర్ణాటక, మహారాష్ట్ర దాదాపు 300కు పైగా చెక్‌డ్యామ్‌లు, ఇతర ప్రాజెక్టులు కట్టాయని, దీంతో దిగువకు జలాలు రావడం తగ్గిపోయిందని, నీటి కొరతతో కరువు ఏర్పడి తెలంగాణ రైతులు ఆత్మహత్య చేసుకున్నారని వివరించారు. ఒక్క గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టుల ఆయకట్టుకే 400 టీఎంసీలకు పైగా కావాలని నొక్కిచెప్పారు.

26న కమిషన్‌కు సాక్ష్యాలు అందిస్తా

ప్రాణహిత ప్రాజెక్టు లక్ష్యం కేవలం 16లక్షల ఎకరాల ఆయకట్టేనని, కాళేశ్వరం కింద కొత్త, స్థిరీకరణ కలిపి 38లక్షలకు పైగా ఎకరాల ఆయకట్టు ఉన్నదని గుర్తుచేశారు. స్వల్పకాలంలోనే 17లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించామని వెల్లడించారు. ప్రాజెక్టు అంచనా వ్యయం పెరిగింది తప్ప అవినీతికి తావులేదని స్పష్టం చేశారు. విద్యుత్తు చార్జీలపై చేస్తున్న ప్రచారం కూడా అబద్ధమని, అసంబద్ధమని తెలిపారు. ప్రాజెక్టు ప్రతి అంశాన్ని నోట్ రూపంలో కమిషన్‌కు అందించానని, కమిషన్ సూచనమేరకు వాటన్నింటికీ సాక్ష్యాలతో సహా 26న అఫిడవిట్‌ను దాఖలు చేస్తానని చెప్పారు.

సమన్ల జారీకి కమిషన్ సమాయత్తం

కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ విచారణ శనివారం నుంచి పునఃప్రారంభమైంది. విశ్రాంత ఇంజినీర్లతో పాటు, పలువురు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ అభిప్రాయాలు వెల్లడించారు. తాజాగా వీ ప్రకాశ్ ప్రాజెక్టు రీ డిజైన్, ప్రయోజనాలను వివరించారు. ప్రాజెక్టు ఇంజినీర్లు, ఏజెన్సీ ప్రతినిధులు, ప్రైవేట్ వ్యక్తుల అభిప్రాయాలన్నింటినీ అఫిడవిట్ల రూపంలో ఇవ్వాలని సూచించిన మేరకు మొత్తం 57మంది అఫిడవిట్లు దాఖలయ్యాయి. రెండు వారాల్లో అఫిడవిట్లపై విచారణ ప్రక్రియ ప్రారంభించే దిశగా కమిషన్ కసరత్తు చేస్తున్నట్టు సమాచారం.

పశువైద్యాధికారికి జాతీయ సాహితీ పురస్కారం

కథల పోటీల్లో కోటేశ్వర్‌రావుకు ప్రథమ బహుమతి

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, ఆగస్టు 17: నమస్తే తెలంగాణ దినపత్రిక, ముల్కనూరు సాహితీ పీఠం సంయుక్తంగా నిర్వహిస్తున్న 2023-24 జాతీయస్థాయి తెలుగు కథల పోటీల్లో కరీంనగర్ ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణ కేంద్రంలో సీనియర్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ ఎం కోటేశ్వరరావు ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. తలపండిన రచయితలు పాల్గొంటున్న ఈ పోటీల్లో ఒక సాధారణ పశువైద్యాధికారి ప్రథమ బహుమతిని గెలుపొందటం విశేషం. ఆయన రూ.50 వేల నగదు బహుమతి, ప్రశంసా పత్రం, మెమెంటో అందుకోనున్నారు. తన కున్న సాహిత్య అనుభవం వృత్తిలో రాణించడానికి, రైతులకు వందల సంఖ్యలో సాంకేతిక వ్యాసాలు రాయటానికి ఎంతో దోహదం చేసిందని డాక్టర్ కోటేశ్వరరావు తెలిపారు. ఆయన్ను సంబంధిత శాఖ అధికారులు అభినందించారు.

'నమస్తే తెలంగాణ' ఫొటోగ్రాఫర్లకు అవార్డులు

ఏపీ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ఫొటోగ్రఫీ కాంపిటేషన్-2024లో 'నమస్తే తెలంగాణ' నల్లగొండ స్టాఫ్ ఫొటోగ్రాఫర్ ఆర్ ఆకాశ్‌కు అవార్డు దక్కింది. దేశవ్యాప్తంగా 500 ఎంట్రీలు రాగా.. నల్లగొండలో బోనాల సందర్భంగా ఆకాశ్ తీసిన పోతరాజు విన్యాసం ఫొటో కన్సోలేషన్ అవార్డుకు ఎంపికైంది. ఈ నెల 19న ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా విజయవాడలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. – నల్లగొండ రూరల్

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ సమాచార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో నమస్తే తెలంగాణ సూర్యాపేట స్టాఫ్ ఫొటోగ్రాఫర్ పీ సైదిరెడ్డి మొదటి అవార్డుకు ఎంపికయ్యారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అంశంపై సైదిరెడ్డి తీసిన ఫొటో ప్రథమ అవార్డు దక్కించుకుంది. ఈ నెల 19న హైదరాబాద్ గ్రీన్ పార్క్ హోటల్‌లో అవార్డుతోపాటు నగదు బహుమతిని అందుకోనున్నారు. –సూర్యాపేట(నమస్తే తెలంగాణ)

మహబూబ్‌నగర్ 'నమస్తే తెలంగా' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ బందిగే గోపి జాతీయస్థాయి ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డుకు ఎంపికైనట్టు ఏపీ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ తెలిపింది. పాలమూరు డైట్ కళాశాలలో మూత్రశాలల వద్ద బారులుబీరిన విద్యార్థినుల వేదనను గుర్తించి తీసిన ఫొటో కన్సోలేషన్ బహుమతికి ఎంపికైంది. ఐపీఆర్ కాంపిటీటివ్‌లో బెస్ట్ న్యూస్ పిక్చర్ కింద సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి అవార్డును అందుకోనున్నారు. –మహబూబ్‌నగర్